# ఆశీర్వాద సభకు పోటెత్తిన జనం



మోర్తాడ్ నుంచి కేసీఆర్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయలు



సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు

- దారులన్నీ కేసీఆర్ సభ వైపే
- స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- కేసీఆర్ సందేశాన్ని ఆసక్తిగా విన్న అభిమానులు
- గులాబీ వనాన్ని తలపించిన వేల్పూర్ ఎక్స్‌రోడ్డు

కమ్మర్‌పల్లి/ వేల్పూర్/భీమ్‌గల్/ బాల్కొండ/ మెండోరా/ ముప్కాల్/ ఏర్గట్ల/ నవంబర్ 2: వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు జనం పోటెత్తారు. ఉదయం నుంచే బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా వేల్పూర్ దారి పట్టారు. దారులన్నీ కేసీఆర్ సభకు వచ్చే జనాలతో సందడిగా మారిపోయాయి. కేసీఆర్ సభా వేదిక పైకి రావడానికి రెండు గంటల ముందే సభా మైదానం నిండిపోయింది. 43 ఎకరాల సభా మైదానం జనంతో నిండిపోయింది. దీంతో కాలినడకన చేరుకొని కేసీఆర్, ప్రశాంత్‌రెడ్డి సందేశాలను ఆసక్తిగా విన్నారు. జై కేసీఆర్, జై ప్రశాంత్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్డు నుంచి. సభాస్థలి వరకు రహదారి పైన నిండుగా తరలివస్తున్న జనం జనధారను తలపించింది. మహిళలు, యువకులు ఉత్సాహంగా తరలి వచ్చారు. కేసీఆర్,ప్రశాంత్ రెడ్డి ప్రసంగిస్తున్నప్పుడు ఈలలు, చప్పట్లతో హోరెత్తిస్తూ మద్దతును చాటారు.



ఏర్గట్ల మండలం నుంచి సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శేణులు

## అందరింటికి కేసీఆరే దేవుడు



ముసలోళ్లు, మొగుడు లేనోళ్లకు, కాళ్లుచేతులు మంచిగ లేనోళ్లకు పింఛన్లు ఇచ్చి సీఎం కేసీఆర్ దేవుడైండు. ఇంటికి పెద్ద దిక్కై మంచి చెడు చూస్తున్నడు.అప్పట్ల ఉన్న కాంగ్రెసోళ్లు ఏం చేసింల్రని మల్ల మాఇండ్ల పొంటి తిరుగుతున్నరు. మళ్లీ కేసీఆర్ కే ఓటేస్తం.. మంచి పనులు చేసిన ప్రశాంత్ రెడ్డిని ఎన్నటికీ మరచిపోం.

- పోసాని, మోతె

## ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే



గ్రామంల ఎన్నడూ సూడనంత పనులు జేసినందుకు ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉంటారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రశాంత్ రెడ్డి వచ్చినంకనే మా గ్రామం మస్తు అభివృద్ధి అయ్యింది. మల్ల కొత్తగా వచ్చిన వారిని మేము నమ్మం. గన్నేండ్లు పరిపాలించిన కాంగ్రెసోళ్లు అప్పుడేం జేసింల్రు.. ఇప్పుడేం ఒరగబెడతామని ఒట్లడుగుతుంల్రు.

- చంద్రకళ, నడ్కుడ

## అన్ని కులాలకు సాయం..



బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాతనే ప్రభుత్వం చేసిన సా యంతో అన్ని కులాలు ఆర్థికంగా బలపడ్డాయి. మత్స్యకారులు, ఇతర కులాలకు చెందిన వారు గతంలో జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లేవారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ సారు అన్ని వృత్తుల వారికి అండగా నిలుస్తున్నారు.ఉచితంగా చేపల్లలు, మోపెడ్లు, డీసీఎంలు అందజేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారు.

- లావణ్య అనికేశి, ముప్కాల్

## కరెంట్ ఫుల్..వాటర్ ఫుల్..



కాంగ్రెస్ పాలనలో కరెంటు, తాగునీటి వసతి ఎట్లుండెనో అందరికీ తెలుసు. ఇంటింటికీ తాగునీటికి కూడా ఇవ్వలేరు. తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలు ఏర్పాటుచేసి నీళ్లు ఇస్తున్నరు. మహిళలకు ఉన్న పెద్ద సమస్యను తీర్చారు.

- విజయ, బాల్కొండ

## ఖోఖో పోటీల్లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



విజేతలతో పాఠశాల సిబ్బంది

బాల్కొండ, నవంబర్ 2 : ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్ జడ్పీహెచ్ఎస్ అక్టోబర్ 31న నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్-14 బాల బాలికల ఖోఖో పోటీల్లో బాల్కొండ కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభ చాటారు. పోటీల్లో విద్యార్థినులు ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి భవాని తెలిపారు. 2015 నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి పోటీల్లో తమ పాఠశాలనే ప్రథమ స్థానం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ స్రవంతి తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

## రైతులకు లింగాకర్షక బుట్టల పంపిణీ



కొత్తపల్లిలో రైతులకు లింగాకర్షక బుట్టలు అందిస్తున్న ఐసీడీసీ ఫౌండేషన్ సభ్యులు

ముప్కాల్, నవంబర్ 2 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఐసీడీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసుపు రైతులకు వేప నూనె, కూరగాయ విత్తనాలు, లింగాకర్షక బుట్టలు, పసుపు రంగు జిగుట అట్టలు, వేస్ట్ డీకంపోజర్, ట్రైకోడెర్మావిరిడే, సుడన్ గడ్డి విత్తనాలను సర్పంచ్ మారెళ్లి విష్ణు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఖర్చులు తగ్గించుకొని ఆదాయం పెంచుకోవాలనే ఉద్దేశంతో ఐసీడీసీ ఫౌండేషన్ తరఫున వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీసీ ఫౌండేషన్ సీఎఫ్ సాయి కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సభ విజయవంతం

### హాజరైన ప్రముఖులు

ముప్కాల్, నవంబర్ 2 : వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభ విజయవంతమైంది. నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు తరలిరాగా.. సభలో ప్రముఖులు పాల్గొన్నారు. సభకు హాజరైనవారిలో ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్య సభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కుటుంబ ఆరోగ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేణుగోపాల చారి, కోటపాటి నర్సింహ నాయుడు, మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణా నవీన్‌గౌడ్, గుణ్ వీర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నియోజకవర్గంలోని ఎంపీపీలు భీమజమున,బి. సుకన్య, సామపద్మ, వై. లావణ్య , అర్మూర్ మహేశ్, లోలపు గౌతమి, ఉపేంద్ర, జడ్పీటీసీలు భారతి, తలారి గంగాధర్, బద్దం నర్సవ్వ, డి. లావణ్య, చౌటపల్లి రవి, పెరుమాల్ల రాధ, గుల్లె రాజేశ్వర్, పార్టీ మండల కన్వీనర్లు, సర్పంచులు ఉన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఉప సర్పంచ్

కమ్మర్‌పల్లి, నవంబర్ 2: మండలంలోని హాసాకొత్తూర్ గ్రామంలోని కట్ట మనోహర్ -లక్షిత కూతురు కట్ట మిథిలా జన్మదినాన్ని ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికుల మధ్య గురువారం కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, జీపీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, రమణ, భగత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కళాజాత

వేల్పూర్ ,నవంబర్ 2: ప్రజా ఆశీర్వద సభలో గాయకుడు మిట్టపల్లి సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత ఆకట్టుకున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కళాకారులు పాటల రూపంలో వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు జరిగిన నష్టాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. భీమ్‌గల్ మండలం పురాణిపేట్ గ్రామానికి చెందిన రైతు సంపత్ .. రైతు బంధు,24 గంటల ఉచిత కరెంట్,రైతుబీమా వంటి పథకాలను తన వీపుపై అక్షరరూపంలో రాయించుకొని రావడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.



కళాజాత బృందం ప్రదర్శన